వాహనాలకు భద్రత ప్రమాణాలు పాటించాలి:ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : వాహనాలకు భద్రతా ప్రమాణాలను పాటించని, స్కూళ్ల, కళాశాల యాజమా న్యాలపై అధికారులు చర్య లు తీసుకోవాలని, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్. మున్నా కోరారు. స్థానిక సంతపేట సిపిఐ కార్యాల యంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. జిల్లా వ్యాప్తంగా పలు విద్యా సంస్థల వాహనాలను, నిబంధ నలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆరోపించారు. అనేక ప్రైవేటు పాఠశాలల, కళాశాలల ఫిట్నెస్ లేకుండా నడుపుతున్నరని అన్నారు. అలాగే పలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిబంధన లను పాటించడం లేదని ఆరోపించారు. పరిమితిని మించి అధిక సంఖ్యలో విద్యార్థుల గమ్యస్థానాలకు రవాణా చేస్తున్నారని అన్నారు. డ్రైవర్లకు తగిన లైసెన్స్ ఉండడం లేదని, డ్రైవింగ్ అనుభవం లేదని ఆరోపణలు ఉన్నాయ న్నారు. రాష్ట్రంలో ఇటీవల అనేకచోట్ల ప్రైవేటు ట్రావెల్స్, విద్యాసంస్థల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వాహనాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల రక్షణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సర్దార్, మీరా ముద్దీన్, పి.కరిముల్లా, వాసుదేవ రెడ్డి, అహ్మద్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

శుక్రవారం 21 నవంబరు, 2025 4 పేజీలు

కళాకారులు కళను

నమ్ముకోకుండా అమ్ముకుంటున్నారు

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: నెల్లూరులో ఉన్నత స్థాయిలో ఉన్న కొంతమంది కళాకారులు కళ ను నమ్ముకోకుండా అమ్ము కుంటున్నారని కళాంజలి శ్రీనివాస్, డాక్టర్ నారాయణ మూర్తి తెలిపారు. గురువారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో కళకు, డ్యాన్స్ విషయములో ఆర్కెస్ట్రా ముసుగులో ముఖ్యంగా ఈవెంట్స్ ముసుగులో రౌడీషీటర్స్, దొంగలు ఇతరత్రా వారు కళను వ్యాపారంగా మార్చి ఇతర రాష్ట్రాల నుండి వందల మంది అమ్మాయిలను కాంట్రాక్టు పద్ధతిలో నెల్లూరుకు తీసుకొచ్చి లాడ్జిలలో మారుమూల ప్రాంతాలలో ఇళ్ళు అద్దెకు తీసుకొని వారికి అక్కడ నివాసం ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు, వేదికలపై పోలీసు వారు పర్మిషన్ లేకుండా అశ్లీల నృత్యాలు, అసభ్యకర మాటలు మాట్లాడిస్తూ వాటిని సోషల్ మీడియాలో ఆ వీడియోస్ పోస్ట్ చేసి తద్వారా లబ్ది పొందుతూ కళా రంగాన్ని, మా గౌరవ మర్యా దలను, మా విలువలను నాశనం చేస్తున్నారు. నెల్లూరు జిల్లా కళామతల్లి ఆడబిడ్డలు తలదించు కొనేలా వాటిని అవమాన పరుస్తున్నారు. జిల్లా సీనియర్ కళాకారులుగా వారితో మేము ఒకటి రెండు సార్లు ఇలా చేయకూడదని చెప్పడం జరిగింది. ఇలాంటి వాళ్ళను ప్రోత్సహిస్తున్న వారికి రాజకీయ నాయకులకు తమ మనవి కళకు సంబంధం లేని వాళ్ళను, రికార్డింగ్ డ్యాన్సర్లను, ప్రోత్సహించవద్దు. నిజమైన కళాకా రులను ప్రోత్సహించాలని కోరారు. దీనిపై జిల్లా ఎస్పి ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యల తీసుకొని కళా కుటుంబాలను బ్రతికించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ డాన్స్ మాస్టర్ సామ్యూల్, డాన్స్ మాస్టర్ రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలుచేయండి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలను సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికా రులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగ ణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శు క్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిటీలోని అధికారులకు సూచించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎన్‌హెచ్ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు,రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు.బుజబుజ నెల్లూరు నుంచి భగత్‌సింగ్ కాలనీ వరకు 9 ప్రమాదభరిత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని నివారణ చర్యలుసత్వరమేతీసుకోవాలనిఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. జాతీయరహదారి కూడళ్ల వద్ద సైనేజ్ బోర్డులు, సోలార్ బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద లోపలికి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు బస్సులు నిలపకుండా చర్యలు తీసుకో వాలని ఆర్టీసీ అధికా రులను ఆదేశించారు. నెల్లూరు నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా వీధివ్యాపారులు ఎక్కువ సమయం ఉండ కుండా ట్రాఫిక్ నివారణకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలోపార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోజరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కలెక్టర్ ఆరాతీశారు. అత్యవసరంగా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల వివరించారు.ఈ సమావేశంలో ఎఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్ అండ్ బి ఎస్‌ఈ రామకృష్ణ ప్రసాద్, డిటిసి చందర్, ఎన్‌హెచ్‌ఎ పిడి ఎంకె చౌదరి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఆత్మకూరు ఆర్‌డివో పావని, ట్రాఫిక్, పోలీసుశాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ హాల్‌లో చైర్పర్సన్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డి పాలెం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి అధ్యక్షతన సాధారణ సమా వేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసం దర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ సాధారణ సమావేశంలో మొత్తం 12 అజెండా లను ప్రవేశపెట్టడం జరిగిందనిఈ12 అజెండా లను కౌన్సిలర్స్ అందరూ కూడా ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని చైర్ పర్సన్ గారు తెలియజేశారు. అదేవిధంగా మున్సిపాలిటీలో ఉండే డివైడర్ మీద ఎటువంటి ఫ్లెక్సీలు కట్టకూడదని, ఒకవేళ ఫ్లెక్సీలు కట్టాలనుకుంటే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి చలానా కట్టాలని, అలా చలానా కట్టని నేపథ్యంలో డివైడర్ మీద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కమిషనర్ భారీ జరిమానా విధిస్తారని ,ఈ విషయాన్ని బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలో ఉండే ప్రజలంతా కూడా అర్థం చేసుకోవాలని చైర్ పర్సన్ తెలియజేశారు.కోవూరు శాసనసభ్యురాలువేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేతుల మీదగా మలేదేవి కాలువ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫైర్ స్టేషన్ యొక్క భూమి పూజ, శిలాపలక ఆవిష్కరణ కార్యక్రమం జరిగిందని తెలియజేశారు.దాదాపు 12 సంవత్సరాల క్రితమే ఈ బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీకి ఫైర్ స్టేషన్ మంజూరు అయిందని, ఈ ఫైర్ స్టేషన్ గురించి ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో, ఆ ఫైర్ స్టేషన్ అధికారులు మన వద్దకు వచ్చి,ఆ ఫైర్ స్టేషన్ యొక్క టైం అయిపోతుందని,అది మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతుందని చెప్పడం జరిగిందని, వారు చెప్పిన వెంటనే ఈ సమస్యను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి దృష్టికి తీసుకెళ్లామని వారు వెంటనే స్పందించి ఫైర్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఈ ఫైర్ స్టేషన్ మళ్లీ వెనక్కి పోనీయకుండా, ఫైర్ స్టేషన్ యొక్క పనులు వెంటనే ప్రారంభించాలని తెలియజేశారు. ఫైర్ స్టేషన్ యొక్క నిర్మాణం కొరకు ఈ డంపింగ్ యార్డ్ లో ఉన్నటువంటి చెత్తను పక్కకు తొలగించేందుకు తమ సొంత నిధులతో, జెసిబిలను పెట్టించి ఆ డంపింగ్ యార్డ్ లోఉండేటటువంటి చెత్తను కూడా తొలగించడం జరిగిందని, దీనికి ఎంపీ గారు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి , ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశానని చైర్పర్సన్ గా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ తో పాటు మున్సిపల్ కమిషనర్ డి బాలకృష్ణ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మనుబోలు టిడిపిలో గ్రూపుల గోల

- వైసీపీకి ప్లస్ కానుందా? సర్వత్ర చర్చ - ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండల టిడిపి లో గ్రూపుల గోల ఆ పార్టీని వెంటాడుతుంది. ఎన్నికలు ముగిసిన రెండు మూడు నెలల్లోనే ప్రతి గ్రామాల్లో గ్రూపులు ఏర్పడి పార్టీ మనగడ కష్ట సాధ్యంగా మారింది. చిన్న చిన్న పంచాయతీల్లో సైతం నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా ఏర్పడి పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని చెప్పవచ్చు .ఈ గ్రూపుల గోల ఇలాగే కొనసాగితే రాబోయే పంచాయితీ ఎన్నికల్లో అధికార టిడిపికి విజయ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఉండొచ్చునని రాజకీయ విశ్లేషకులు వర్ణిస్తున్నారు. మనుబోలు మండలంలో ఇప్పటికే రెండు, మూడు పంచాయతీలు తప్ప మిగతా అన్ని పంచాయతీల్లో వైసిపి సర్పంచులు కొనసాగుతున్నారు. మండలంలో గ్రూపు లేని గ్రామమే లేదు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంతో ఉత్సాహంగా సోమిరెడ్డి కు విజయా నందించిన నాయకులు కార్యకర్తలకు ఇప్పుడు ఏమైందంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన నాయకులు నిర్లక్ష్యంలో ఉన్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీని ముందుండి నడిపించాల్సిన మండల నాయకులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు ఇదిలా ఉండగా ఇప్పటికే మండలంలో కాకాణి క్యాడర్ దూసుకెళ్తోంది. ఇటు సోషల్ మీడియాలో అటు కోటీ సంతకాల సేకరణ అంటూ ప్రజల్లో నిత్యం నాయకులు కార్యకర్తలు హల్చల్ చేస్తున్నారు. టిడిపి గ్రూపుల గోల వైసీపీకి ప్లస్ కానుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ముఖ్యంగా టిడిపి మెజార్టీ గ్రామాల్లో కూడా వ్యతిరేక పవనాలు వేస్తుండడం విశేషం, ఇకనైనా ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవ తీసుకొని నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై తీసుకొని వచ్చి మండలంలో చక్కది ద్దాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-కలువాయి : 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపులో భాగంగా మండల కేంద్రమైన కలువాయి బివిఎన్ఆర్ జడ్పీ హైస్కూల్ నందు మంగళవారం నిర్వహించిన ఆటలు పోటీల్లో గెలిపిందిన విద్యార్థులకు గురువారం బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ అలి,కలువాయి గ్రంథాలయ ఇన్చార్జ్ పి సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పచ్చిపాల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మనుబోలు: మనుబోలా హైస్కూల్లో తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్య దర్శి టిడిపి యువ నేత పచ్చిపాల రామిరెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ నందు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్య తన జన్మదినం జరుపుకోవడం సంతోషకరంగా ఉందన్నారు టిడిపి నాయకులు మాట్లాడుతూ పచ్చిపాల మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాం అన్నారు. పచ్చిపాల మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అన్నారు. పలువురు పచ్చిపాలకు జన్మదిన వేడుకలను తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు శేఖర్ రెడ్డి ,రాయపాటి కిరణ్ ,శేఖర్ రెడ్డి, సుమంత్, సురేష్ భారీ ఎత్తున పచ్చిపాల యువత తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు సేవలు అభినందనీయం: భాస్కర్ గౌడ్

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు మండల ప్రజలకు జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి, చిట్టమ్మూరు అనసూయమ్మ దంపతులు చేసిన సేవలు మరువలేనివని బీసీ సెల్ నాయకులు దాసరి భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. చిట్టమూరి అనసూయమ్మ ఆరవ వర్ధంతి పురస్కరించుకొని మనుబోలు గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం బాబా వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భారీ అన్న సమర్పణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా చిట్టమూరి పద్మనాభరెడ్డి అనసూయమ్మ దంపతులు మనుబోలు మండల ప్రజలకు ఆర్థికంగా, వైద్య పరంగా చేసిన సేవలను గుర్తు తెచ్చుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు జడ్పిటిసి చిట్టమూరి అనితమ్మ, ఉచ్చూరు దయాకర్ రెడ్డి, మనుబోలు ఎంపీటీసీ దువ్వూరు రాజేశ్వరమ్మ, సుధాకర్ రెడ్డి,చల్లా నవకోటి, పరిమళ శివరామకృష్ణ, కాల్తిరెడ్డి శ్రీనివాసులు గౌడ్, చిట్టమూరి చిట్టమూరి దంపతుల అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

గురువును సత్కరించిన పూర్వ విద్యార్థులు



విశాలాంధ్ర -మనుబోలు: మండలంలోని బద్దెవోలు వెంకన్న పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థులు లెక్కలు మాస్టర్ ను సన్మానించుకున్నారు. గురువు గమిడి వెంకటసుబ్బయ్య విజయమ్మ దంపతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఅప్పటి లెక్కల గురువు వెంకటసుబ్బయ్య. విజయమ్మ లతో పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించి ఘనంగా సన్మానించుకుని గురువు పట్ల తమకున్న భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.స్కూల్లో చదువుకున్న సమయంలో గత స్మృతులను నెమరు వేసుకున్నారు.వీరితో ఫొటోలు దిగారు. తనను గుర్తుపట్టి సన్మానించిన పూర్వ విద్యార్థులను లెక్కల గురువు వెంకటసుబ్బయ్య ధన్యవాదాలు చెప్పారు. ఈ సమావేశంలోపూర్వ విద్యార్థులు బద్దెవోలుమాజి సర్పంచ్ మనుబోలు సొసైటీ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య. మేదరమెట్ల పెంచలనాయుడు. పాదర్తి రవి కనుపూరు శ్రీధర్ రెడ్డి. గాలి రవి చంద్రా రెడ్డి బ్రహ్మ దేవి శీనయ్య.సుబ్బారెడ్డి (ఖమ్మం) వల్లూరు రాజశేఖర్ రెడ్డి. చిట్ట మూరు రాజ శేఖర్ రెడ్డి. శానంపూడి సురేందర్ రెడ్డి కోడూరు కమలాకర్ రెడ్డి. బెల్లం శేషారెడ్డి. వల్లం కొండ వెంకట కృష్ణయ్య. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సభ్యుల మధ్య అవగాహన ఉన్నప్పుడే

సహకార సంఘాల అభివృద్ధి చెందుతాయి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :సహకార సంఘాల సభ్యుల మధ్య మంచి అవగాహన ఉన్నప్పుడే సహకార సంఘాల ద్వారా ప్రజలకు అనుకున్న స్థాయిలో సేవలు అందించవచ్చు అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అభిప్రాయపడ్డారు.గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు-2025 ముగింపు సందర్భంగా సహకార శాఖ ఆధ్వర్యంలో తిక్కన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ సహకార సంఘాలు వారి సభ్యుల మధ్య సరి అయినా అవగాహనతో సేవా దృక్పథం తో పాటు ఆ ప్రాంత సమస్య గుర్తించి దాని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అప్పుడే సొసైటీలు బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. సహకార సంఘాలలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావు ఇవ్వకుండా అందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలన్నారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక సమస్య ఉంటుందని ప్రాంతాలను బట్టి సహకార సంఘాలు సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. సహకార సంఘాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు గాని మూడు నెలలకు గాని సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో పాటు వచ్చిన ఆదాయాన్ని సభ్యులందరికీ సమపాళ్లలో పంచవలసిన అవసరం ఉందన్నారు. దేశం మొత్తం మీద 8.50 లక్షల సహకార సంఘాలు ఉన్నాయన్నారు. కేరళ రాష్ట్రం పేదరిక రహిత రాష్ట్రంగా గుర్తించడానికి కారణం సహకార సంఘాలు అనిబ్ఆయన తెలిపారు. రాజ్యసమితి 2012లో ఒకసారి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించడం జరిగిందన్నారు. డిసిసిబిలు, పీఏసీలు, సహకార సంఘ సొసైటీలు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా, అత్యుత్తమ సేవలు అందించిన సహకార సంఘాలు, సహకార శాఖ సిబ్బందికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి సీఈఓ లు,డివిజనల్ అధికారులు, సహకార సంఘాల ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో వైభవంగా సహస్ర దీపారాధన

విశాలాంధ్ర - పొదలకూరు: పొదల కూరు పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో గురు వారం రాత్రి సహస్ర దీపా రాధన మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ దీపారాధన వేడుకల్లో పాల్గొన్నారు. దీపాలను వెలిగించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దీపారాధనకు అవసరమైన ప్రమిదలు, నూనె, వత్తులను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. కార్తీక మాసం సందర్భంగా ఈ ఆలయంలో గత 19 ఏళ్లుగా.. ప్రతి ఏటా ఈ వేడుకను జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు స్వామి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవా సమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదర్ రావు, వైస్ చైర్మన్ దేవరం నారసింహారెడ్డి కమిటీ ప్రతినిధులు పంగులూరు సుబ్బానాయుడు ,లక్కాకుల ఆనందరావు, కొత్తలూరు కోటేశ్వరరావు, తుమ్మల శ్రీనివాసులు, తరుగు ప్రభాకర్, కదిరి ప్రసాద్, చాగలేటి శ్రీహరి, అంపేరాయని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టోక్యో డెఫ్లింపిక్స్‌లో

కెఎల్‌హెచ్ జీబీఎస్ విద్యార్థికి డబుల్ గోల్డ్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కేఎల్ హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కేఎల్‌హెచ్ జీబీఎస్), హైదరాబాద్‌కు చెందిన ప్రతిభావంతుడైన బిబిఏ విద్యార్థి, భారత షూటింగ్ స్టార్ ధనుశ్ శ్రీకాంత్ టోక్యో డెఫ్లింపిక్స్ 2025లో ఐక్యంగా రెండు బంగారు పతకాలు సాధించి ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టాడు. హైదరాబాద్‌కు చెందిన ధనుశ్, పురుషుల10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్‌లో అద్భుతమైన 252.2 స్కోర్ సాధించి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో 630.6 స్కోర్ చేసి డెఫ్లింపిక్స్ రికార్డు సృష్టిస్తూ ఫైనల్స్‌కు అర్హత పొందాడు. ఈ విజయాలతో ధనుశ్ తన మూడవ, నాలుగవ డెఫ్లింపిక్స్ స్వర్ణ పతకాలను సాధించాడు. 23 ఏళ్ల ధనుశ్ 2022లో బ్రెజిల్‌లో జరిగిన డెఫ్లింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ షూటింగ్‌లో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటాడు. ధనుశ్ అసాధారణ విజయంపై మాట్లాడిన కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ ఇఆర్.కోనేరు లక్ష్మణ్ హవీష్ మాట్లాడుతూ "ధనుశ్ చూపిస్తున్న దృఢ సంకల్పం, క్రమశిక్షణ, పట్టుదల ప్రతి విద్యార్థికి స్ఫూర్తి. అతని ప్రపంచ రికార్డు భారతదేశ గర్వం. కేఎల్ హెచ్ జిబిఎస్ అతని ప్రయాణం పట్ల గర్వపడుతోంది. హద్దులను చెరిపేసి కొత్త అవకాశాలను సృష్టించే అథ్లెట్లకు మా పూర్తి సహకారం అందిస్తాం." అని అన్నారు.

ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-ఆత్మకూరు : మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనలతో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మరియు మాజీ జడ్పీటీసీ సభ్యులు, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు కల్లబొళ్ళు మాటలు చెబుతూ, ప్రజలను మోసం చేస్తుందని, వైయస్ జగన్మోహన్ రెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలకు పెద్దపీట వేస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ యువతను ఎంతో ఇబ్బందులు గురి చేస్తుంది. అంతేకాక సూపర్ సిక్స్ పథకాలను పేరుకే విడుదల చేస్తూ, లబ్ధిదారుల్లో కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరుతుందే కానీ మిగతా లబ్ధిదారులకు మాత్రం మొండి చేయి చూపిస్తుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను రద్దు చేసే అంతవరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మరియు మాజీ జెడ్పిటిసి సభ్యులు, చిన్నపిల్లల విభాగ అధ్యక్షులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య,రాష్ట్ర మున్సిపల్ విభాగం జనరల్ సెక్రటరీ అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీ కొండా వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తోడేటి సుబ్రహ్మణ్యం, యువ నాయకుడు నోటి వినయ్ కుమార్ రెడ్డి, బత్తల మాలకొండయ్య, చిల్లూరు వెంకటేశ్వర్లు, చీర్ల మస్తానయ్య, చిల్లూరు వెంకట రాకేష్, ఈదల ముసలయ్య, ఖాజావళి, పర్వీన్, కల్పన, చెరుకూరు అనిల్ కుమార్,తాటిబోయిన సురేష్, చీర్ల శ్రీను, పిన్నిబోయిన మస్తానయ్య, బత్తల మనోజ్, సాజిద్, కప్పల పెంచలయ్య, మందాడి రవీంద్ర, గోగుల మాల్యాద్రి, పార్లపల్లి వెంకటేశ్వర్లు రెడ్డి, రహీమ్, పచ్చిపాల సుబ్రమణ్యం, ఆది, హర్ష, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-కావలి సమాజం లో బాలల హక్కుల పై అవగాహన కల్పించి విద్యా హక్కు చట్టాన్ని పటిష్టం గా అమలు చేయాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం మాల కొండారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరినారు. తల్లిదండ్రుల అవగాహన లోపం వల్ల బాలబాలికలు బడి బయట తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్య రాజ్యసమితి 1989 నవంబర్ 20 న ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం గా ప్రకటించారు.బాల బాలికలను పాఠశాలలో చేర్పించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సమాజంలో బాల బాలికలను హోటల్లో గాని ఫ్యాక్టరీలో గాని షాపుల్లో గాని పనిచేయించుకోవడం నేరమన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంపొందించి బాల బాలికలను ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. దీని కొరకు మేధావులు ఉద్యోగులు తల్లిదండ్రులు నిరంతరం కృషి చేయాలన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ చేసిన ఏవో

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో ఉన్న హరిత పుత్ర వెజిటల్ అండ్ మిల్లెట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ షాప్ నందు మండల వ్యవసాయ అధికారి కేవి శేషా రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఈ తనిఖీలో భాగంగా ఓ ఫారం సరిగ్గా లేని మరియు అనుమతిలేని గోదాములో ఉంచిన మూడు కంపెనీల 36.09 మెట్రిక్ టన్నుల డి.ఏ.పి, అమ్మోనియం సల్ఫేట్, యూరియా మరియు ఎస్.ఎస్‌పి సంబంధించి 4,25,480 రూపాయల విలువ గల ఎరువులను నిలుపుదల చేసారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి శేషారెడ్డి మాట్లాడుతూ మండలం లోని అన్ని ఎరువుల దుకాణధారులకు ఎరువుల మరియు పురుగుమందుల కు సంబంధించిన ధరల పట్టికను ఏరోజుకారోజు దుకాణంలో ప్రదర్శించాలని అన్నా రు. ఎరువుల దుకాణంలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ లను రద్దుచేసి చట్టప్రకారం చర్యలకు సిఫార్సు చేస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ కోర్టు ప్రారంభించిన చల్లా రఘురామిరెడ్డి

విశాలాంధ్ర-కలువాయి : కలువాయి బివి ఎన్ ఆర్ జడ్పీ హైస్కూల్ నందు గురువారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ అలీతో కలిసి టిడిపి మండల అధ్యక్షుడు రఘు రామిరెడ్డి నూతన షటిల్ కోర్టును ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల పట్ల అంకితభావం కలిగి ఉండాలని ఆయన కోరారు. నూతన షటిల్ కోర్టు నిర్మాణానికి కలువాయి మండల తెలుగు యువత, జడ్పీ హైస్కూల్ సిబ్బంది సహకారంతో నూతనంగా షటిల్ కోర్టు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడుచల్లా విజయ్ భాస్కర్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు నూటేటి నరసింహులు, ఎన్‌సిసి ఆఫీసర్ పెంచలపుల్లయ్య పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ పై శిక్షణ

విశాలాంధ్ర- ముత్తుకూరు: పంచాయతీలలో క్లీన్ అండ్ గ్రీన్ ఏ విధంగా చేయాలి అన్న అంశంపై థీమ్ 5 కింద సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రతి పంచాయతీలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం తప్పనిసరిగా చేయించాల న్నారు. పంచాయతీలను క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచాలంటే ఏ విధంగా చేయాలి, ఎలా చేయాలి, అందుకు అవసరమైనటువంటి వనరులు ప్రభుత్వపరంగా ఏమైనా ఉన్నాయా, స్థానికంగా వనరులను సేకరించుకునే అవకాశాలు ఉన్నాయా లేదా అనే పలు అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్ప్లే ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో శివ భాస్కరరావు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సొసైటీగా కృష్ణపట్నం



విశాలాంధ్ర- ముత్తుకూరు: రైతులకు అన్ని విధాలుగా సేవలందించడంతోపాటు, సొసైటీ లాభాల బాటలో ఉన్న మన కృష్ణపట్నం సొసైటీని ఉత్తమ సొసైటీగా జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల ప్రకటించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని తిక్కన భవనంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డికి జిల్లా కలెక్టర్ హిమాన్స్ శు క్ల అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణపట్నం సొసైటీ కి తన హయాంలో ఉత్తమ అవార్డు రావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. సొసైటీ లోన్స్ సభ్యులైన రైతులందరూ రుణాలు తీసుకోవడం, సకాలంలో కూడా చెల్లించడం వల్ల మరికొంద రైతులకు కూడా రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సొసైటీ రుణాలు ఇవ్వడమే కాకుండా తిరిగి వాటిని రికవరీ కూడా సిబ్బంది చేస్తున్నారని అందువల్లే కృష్ణపట్నం సొసైటీ లాభాల బాటలో నడుస్తుందని ఆయన తెలిపారు. ఈ అవార్డు రావడంతో తనకు బాధ్యత మరింత పెరిగిందని, ఈ సొసైటీ అధ్యక్షులుగా తనను నియమించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ అవార్డు దక్కిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేలటూరు పునరావాస కేంద్రంకు జెన్కో నిధులు మంజూరు

విశాలాంధ్ర-ముత్తుకూరు: ఏపీ జెన్కో, సెంబ్ కార్ప్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కాలుష్య ప్రభావిత గ్రామమైన నేలతూరు పంచాయతీ తరలింపు పునరావస్ కేంద్ర నిర్మాణానికి ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ 10.5 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్టు టిడిపి మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల ప్రభావిత గ్రామమైన నేలటూరును తరలించేందుకు గత టిడిపి ప్రభుత్వం సెంబ్ కార్ప్, ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నుండి అప్పట్లో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి 40 కోట్ల రూపాయలను మంజూరు చేయించి భూసేకరణ, నేలటూరు గ్రామానికి చెందిన వారికి మాదరాజు గూడూరు సమీపంలో ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది అని తెలిపారు. అయితే తదుపరి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నుండి పునరావాస కేంద్రానికి అవసరమైనటువంటి నిధులను తీసుకువచ్చి పునరావాసకి కేంద్రాలను పూర్తి చేయాల్సి ఉందని, అయితే తమ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన 40 కోట్ల రూపాయల లో కూడా 15 కోట్ల రూపాయలను దారిమళ్లించి ఇతర పనులకు ఉపయోగించడం జరిగిందన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది నవంబర్ నెలలో ఏపీ జెన్కో థర్మ విద్యుత్ ప్రాజెక్ట్ 10.5 కోట్ల రూపాయలను, ఈ ఏడాది 10.5 కోట్ల రూపాయలు ప్రస్తుతం మళ్లీ మంజూరు చేసిందని, అందులో ప్రస్తుతం ఐదు కోట్ల రూపాయలను రిలీజ్ చేసిందని, మిగిలిన 5.5 కోట్ల రూపాయలను ఇచ్చేందుకు అవసరమైన మంజూరు పత్రాన్ని కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నేలటూరు కేంద్రాలను తమ ప్రభుత్వం లోనే అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గతంలో మంత్రిగా పనిచేసిన కాకాని గోవర్ధన్ రెడ్డి నేలటూరు పురావస్ కేంద్రానికి ఒక పైసా కూడా ఖర్చు పెట్టకపోవడం విచారకరమన్నారు. అలాగే నిధులు దారి మళ్లించకుండా ఉంటే ఆ నిధులు కూడా పునరావస్ కేంద్రాలు మౌలిక వసతులకు వాడే వారిని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, ఏపీ జెన్కో టిఎన్‌టిసి నాయకులు రవి, ఈశ్వరయ్య, రవి, వెంకటయ్య, మత్స్యకార సంఘం నాయకులు జనార్ధన్, విజయ, మండల ఎస్సీ సెల్ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం

విశాలాంధ్ర:-మనుబోలు : గుంటూరు జిల్లాప్రముఖ వ్యాపారవేత్త టిడిపి నాయకులు గొల్లపూడి అరుణ్ కుమార్ ఆయన వియ్యంకులు మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామానికి చెందిన చల్లగిరి చిట్టిబాబు ఆయన కుమారుడు కోడలు చల్లగిరి వెంకట సాయికుమార్ శ్రేయ దంపతులు బాపట్ల ఆంజనేయ స్వామికి ఐదు లక్షల రూపాయలు విరాళాన్ని గురువారం అందజేశారు. సాయి. శ్రేయకు ఇటీవల వివాహం అయింది. బాపట్ల ఎమ్మెల్యే వి నరేంద్ర వర్మ రాజుకి ఈ నగదును స్వామివారి దేవాలయానికి స్వయంగా వెళ్లి అందజేశారు. బాపట్ల ఆంజనేయ స్వామికి విరాళం ఇవ్వాలనే మొక్కుబడికి కట్టుబడి ఈ విరాళం అందజేసినట్టు టిడిపి నేత ఎమ్మెల్యే సోమిరెడ్డిచంద్ర మోహన్ రెడ్డి అనుచరుడు చల్లగిరి చిట్టిబాబు. లీలావతి. గురువారం (కాగితాల పూరు) మీడియాకు తెలిపారు. స్వామివారి కరుణ కటాక్షాలతో అందరం హాయిగా ఉండాలని ఈ విరాళాన్ని అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు వీరిని శాలువా కప్పి సత్కరించి అభినందించారు. బాపట్ల ఆంజనేయ స్వామి దేవాలయంపూజారి. ధర్మకర్తలు స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని దీవించారు.

విడవలూరు గ్రంథాలయంలో అక్షరాస్యత నిర్మూలన

విశాలాంధ్ర-విడవలూరు: 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అక్షరాస్యత నిర్మూలన మరియు జాతీయ గ్రంథాలయ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి నరేష్ ముఖ్య అతిథిగా మరియు ఎన్జీవో శేఖర్ బాబు విజయ్ కుమార్ సీనయ్య మరియు జడ్పీ హైస్కూల్ లైబ్రరీ అక్షర స్కూలు కరస్పాండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొని మాట్లాడారు అక్షరాస్యత నిర్మాణం గురించి పిల్లలకు సవివరంగా వివరించారు బాగా చదివి విద్యను అభ్యసించి ఉన్న స్థాయికి ఎదగాలని కుటుంబానికి సమాజానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని వారు సూచించారు విద్యార్థిని విద్యార్థులు లైబ్రరీ నందు మెంబర్షిప్ తీసుకుని జ్ఞానాన్ని అధికంగా పెంపొందించాలని సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమాన్ని లో లైబ్రరీ నిరూప పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు

విడవలూరు సంఘమిత్ర సభ్యులకు శిక్షణ

విశాలాంధ్ర-విడవలూరు: విడవలూరులోని సంఘమిత్ర కార్యాలయంలో ఏపీఎం ఎంకమ్మ అధ్యక్షతన ఎంసిఎల్ఎఫ్‌లకు ట్రైనింగ్ సంఘ బంధం అధ్యక్షులకు వివోఏలకు ఎనిమిది అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యం విద్య వ్యవసాయం సామాజిక బాధ్యత బద్ధత ఆస్తుల సృష్టి సుస్థిర జీవన పాదుల ప్రవర్తనలో మార్పు సామర్థ్య పెంపు అంశాలపై చర్చించడం జరిగింది . ఈ సమావేశంలో వెలుగు సిసి పి శివకుమార్ బి శ్రీదేవి డి సుకుమార్ చంద్రశేఖర్ మమత పెద్ద సంఖ్యలో సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి

విశాలాంధ్ర-కందుకూరు : కందుకూరు మండలం పాలూరు దొండపాడు రైతు సేవ కేంద్రం నందు ఆయిల్ ఫామ్ డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి బి జ్యోతి మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన శాఖ ,రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు మొక్కల కొనుగోలు ఖర్చుకు ,సిమెంట్ స్తంభాల ఖర్చుకు సాగు కలిపి రెండు సంవత్సరాలపాటు సబ్సిడీ మొత్తం 270000 అందిస్తుందని ,డ్రాగన్ ఫ్రూట్ 10 అడుగులు అంతరం పెట్టి మొక్కలు నాటుకోవచ్చు ,సాగులో మెళుకువలను గురించి తెలియజేశారు .ఒక రైతుకు గరిష్టంగా 5 ఎకరంల వరకు రాయితీ అందచేస్తారని తెలియజేశారు పాలూరు దొండపాడు నేలలు ఉద్యాన సాగుకు అనుకూలమని నీటి వసతి ఉన్న నేలల్లో ఆయిల్ ఫామ్ సాగు కూడా చేపట్టవచ్చుని తెలియజేశారు. డ్రిప్ అనుసంధానం చేసుకుంట మేలైన దిగుబడి సాధించవచ్చునని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఛాంపియన్ రైతులు పాల్గొనగా రైతు సేవ కేంద్రం సిబ్బంది జగదీష్ ,ఆయిల్ ఫామ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండల విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర- వలేటివారి పాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి క్రీడా పోటీల ఎంపికలలో భాగంగా మంగళవారం ౹ సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జిల్లా ఖో. ఖో జట్ల ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వలేటివారిపాలెం విద్యార్థులు 17 సంవత్సరాల విభాగంలో చప్పిడి అశ్విత, 14 సంవత్సరాల విభాగంలో చొప్పర లోకేష్,, ఈర్ల పూజిత రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనటానికి అర్హత సాధించారు. అదేవిధంగా బుధవారం కనిగిరి నియోజకవర్గం కంచర్ల వారి పల్లిలో జరిగిన జిల్లా కబడ్డి సెలక్షన్స్ నందు 17 సంవత్సరాల విభాగంలో మర్రి మనివిష్ణు, 14 సంవత్సరాల విభాగం లో గూడూరు సంతోష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారు. వీరందరూ త్వరలో కర్నూలు మచిలీపట్నంలో జరగబోవు రాష్ట్రస్థాయి ఖో. ఖో,, కబడ్డీ పోటీలలో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కత్తి ఇజక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రావీణ్యం సాధించి పాఠశాలకు అదేవిధంగా గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీఎన్ కమల్ కుమార్ తెలియజేసి వారిని అభినందించారు..అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీస్సులు అందించి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కత్తి ఐజక్‌ను పలువురు అభినందించి మునుముందు విద్యార్థులను ఇలాగే తీర్చిదిద్దాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజానాట్యమండలి మహాసభలకు నిధులు వసూళ్లు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా నాయకులు దూది విజయకుమార్ తళ్ళు సీనయ్యల నాయకత్వంలో నెల్లూరు నగరంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు స్టోన్ హౌస్ పేట ప్రాంతాలలో మాస్ కలెక్షన్ చేయడం తో పాటు మహాసభల ప్రచారాన్ని కూడా చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ కళాకారుల కోసం ప్రజా పోరాటం చేసేందుకు ఏర్పడ్డ ప్రజానాట్యమండలి మహాసభలకు విస్తృతంగా ప్రజలు ఆదరిస్తున్నారని 22వ తేదీ మహాసభను ఘనంగా జరిగేందుకు ఏర్పాటు చేస్తున్నామని అందుకు అన్ని వర్గాల ప్రజల సహకారాన్ని కోరుతూ నెల్లూరు నగరంలో విస్తృతంగా ప్రచారము మరియు నిధి వసూలు చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి జిల్లాలీ ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలమోహన్ తోపాటు పలువురు ప్రజా కళాకారులు, ముఠా వర్కర్స్ నాయకులు పలువురు కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-జలదంకి: నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో జలదంకి మండలంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 14న ప్రారంభమై 20 తో ముగిసాయి. గురువారం జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిజ్ఞతో ప్రారంభమై, వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కవి రచయిత శ్రీనివాసులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని గ్రంథాలయాలపై తనకున్న మక్కువను తెలి య జేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఈఓ నాగేశ్వరరావు, ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమానియ లు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాధరి,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ షిరిడి సాయిబాబా కు ప్రత్యేక అభిషేకాలు పూజలు

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద సమర్పణ కార్యక్రమం చేశారు. అర్చకులు శశి కుమార్ శర్మ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలకు ఉభయ దాతలుగా మనుబోలు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కీర్తిశేషులు చిట్టమూరి పద్మనాభరెడ్డి సతీమణి కీర్తిశేషులు చిట్టమూరి అనసూయమ్మ ఆరవ వర్ధంతి సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి, నిర్మలమ్మ దంపతులు వీరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఇళ్లు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-కందుకూరు : పేదల సొంతింటి కలలు నిజం చేయటంలో భాగంగా, కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లు మంజూరు చేస్తోందని కందుకూరు శాసనసభ్యులు లిఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణ పరిధిలో 417 మందికి ప్రభుత్వం తరఫున ఇళ్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన సాంక్షన్ ఉత్తర్వులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని బృందావనం, కోటారెడ్డి నగర్ 1,2 సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డి ఈ నారాయణ, తహసిల్దార్ లావణ్యతో కలిసి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో పేదల కోసం టిడ్కో ఇళ్లను కట్టించిన సంగతిని గుర్తు చేశారు. కందుకూరు పట్టణంలో 1400 కుటుంబాలు, టిడ్కో ఇళ్లల్లో కాపురం ఉంటున్నారని చెప్పారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కనీసం 10% పనులు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఊరికి దూరంగా వాగులు, వంకల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచిం చారు. లబ్ధిదారుల ఎంపికలో ఏవైనా సమస్యలు ఉంటే, వారికి అన్యాయం జరగకుండా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సొంతగా స్థలాలు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ ఇంటూరి సుబ్బారావు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాస్ రావు, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, కల్లూరి శైలజ, మహర్షి శ్రీను, చనమాల శ్రీధర్, గేరా నరేష్, దాసరి ప్రమోద్, శ్యామ్ పాలేటి కోటేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, గుమ్మా శివ, వలేటి వెంకటేశ్వర్లు,, మంచిరాజు మురళి, మేద మల్లికార్జున, సవిడిబోయిన వెంకటకృష్ణ, షేక్ రూబీ, జియా వుద్దీన్, కొచ్చర్ల తనూజ్ కుమార్, అన్ని వార్డు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు..

వృద్ధులకు రక్షణ చట్టం మీద

న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-కావలి: కావలి మండల పరిధిలో ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో వయోవృద్ధులకు రక్షణ చట్టం మీద న్యాయ విజ్ఞాన సదస్సు .. వయోవృద్ధులను, తల్లిదండ్రులను తమ పిల్లలు నిర్లక్ష్యం చేసిన, లేదా వారిఆస్తులను అక్రమంగా పొందిన, వారిని అనాధలు చేసి న వారిపై వయోవృద్ధుల రక్షణం చట్టం కఠిన చర్యలు తీసుకొంటుదని కావలి మండల న్యాయ సేవాధికారిక చైర్మన్ ఎ. గీతా వాణి ఆదేశాల మేరకు కావలి మండల లీగల్ ఎయిడ్ మెంబరు మరియు న్యాయవాది ఐ. సాయి ప్రసాద్ మరి యు లోక్ అదాలత్ మెఃబరు యం. మాలకొండారెడ్డి వివరించారు. అలాగే దీనిమీద ప్రభుత్వాలు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వృద్ధులను, తల్లిదండ్రులు లను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన శిక్ష లు వుంటాయని, అలాగే పేదవారు, వృద్ధులు మండల న్యాయసేవాధికారిక సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు అని అక్కడ వున్న ప్రజలకు అవగాహన కల్పించారు ఆ కాలనీలో వున్న పిల్లలు అందరిని బడికి పంపించాలిఅని, సమాజం లో గౌరవం గా జీవించాలని సాయి ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్య క్రమంలో యలంపల్లి రమణ య్య, వెంకమ్మ, యల్లంపల్లి చెంచమ్మ, శాంతమ్మ,ప్రజలు పాల్గొన్నారు.

కోవూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-కందుకూరు : మండల పరిధిలోని కోవూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించటం జరిగిందన్నారు. అదే విధంగా గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం కూడా చేపట్టారు. గ్రామస్తులు,ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సిహెచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌లో పరిసరాలు - పరిశుభ్రత

విశాలాంధ్ర-కావలి: జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ఎన్.ఎస్.ఎస్. యూనిట్ల ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో భాగంగా రెండవ రోజు కావలి శివారులోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద గిరిజన కాలనీలో మరియు కావలి చెరువు సమీపమున ఎస్టీ. కాలనీలో పరిసరాలు - పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి సుబ్రహ్మణ్యం నాయుడు ప్రసంగిస్తూ పరిసరాలు మురికిగా, అపరిశుభ్రంగా ఉన్నట్లయితే అంటు రోగాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, కావున ఎవరికి వారు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. అనంతరం కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, ముళ్ళకంపలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రపరిచారు. తదుపరి రోడ్డుపక్కల తేమ ఉన్న ప్రాంతాలలో, నీరు నిలువ ఉన్న దగ్గర బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ కార్యక్ర మం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు పి. నాగేశ్వరరావు, ఎస్.కె. అయూబ్ అహ్మద్ పర్యవేక్షణలో జరిగింది. ఈ రెండవ రోజు కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి , కళాశాల అధ్యాపకులు, కాలనీవాసులు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొని ఫలప్రదం చేశారు.

కల్వర్టు తాత్కాలిక మరమ్మత్తులను పరిశీలించిన కాకాణి

విశాలాంధ్ర - పొదలకూరు: పొదలకూరు మండలం దేగపూడి ఎస్టి కాలనీ వద్ద కూలిన కల్వర్టుకు ఆర్ అండ్ బి అధికారులు చేపట్టిన తాత్కాలిక మరమ్మతులను గురువారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. గత మంగళవారం సాయంత్రం ఈ కల్వర్టు కూలిపోవడంతో నెల్లూరు-రాపూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆర్ అండ్ బి అధికారులు ఈ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరింపజేశారు. ఈ నేపథ్యంలో కాకాణి ఈ కల్వర్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వైఎస్ఆర్సిపి పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప, కూటమిపాలనలో శాశ్వత ప్రాతిపదికన ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. ఈ కల్వర్టు కుంగినప్పుడే వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయని, అయితే సంబంధిత అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.